సాక్షి పెద్దపల్లి

సోమవారం । 27 । నవంబర్ । 2023



మల్లన్నకు పట్నాలు

ఓదెల: ఓదెల శ్రీమల్లికార్జునస్వామిని ఆదివారం వేలాది మంది దర్శించుకున్నారు. పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.



ఆదివరాహస్వామికి పూజలు

కమాన్‌పూర్(మంథని): శ్రీఆదివరాహస్వామి దర్శనం కోసం భక్తులు భారీసంఖ్యలో తరలి వచ్చారు. స్వామివారిని దర్శించుకున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా మహాపడిపూజ



మెట్లపూజ చేస్తున్న గురుస్వామి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): స్థానిక శ్రీఅయ్యప్పస్వామి ఆలయ వారికోత్సవం సందర్భంగా మహాపడిపూజ వైభవంగ నిర్వహించారు. ఈ కార్యక్రమంతో మూడురోజుల ఉత్సవాలు ముగిసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ప్రధాన గురుస్వామి శ్రీఅద్దెంకి సారంగాచారి ఆధ్వర్యంలో పదునెట్టాంబడి ఘనంగా నిర్వహించారు. 18 మెట్లకు ప్రత్యేక పూజలు చేసి 18పడులు వెలిగించారు. అయ్యప్పస్వాములు పాడిన భక్తి పాటలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు, అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు నృసింహుని కల్యాణం



పూజలు చేస్తున్న భక్తులు

పెద్దపల్లిరూరల్: దేవునిపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 24న ప్రారంభమయ్యాయి. డిసెంబర్ 3వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ రావిశెట్టి కొమురయ్య, ఈవో శంకరయ్య ఆదివారం తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు సర్పంచ్ రాయిశెట్టి కిషన్ పేర్కొన్నారు. సోమవారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తారని వివరించారు. పెద్దపల్లి జిల్లాతోపాటు పొరుగు జిల్లాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివస్తారని పేర్కొన్నారు. డిసెంబర్ 2న రథోత్సవం, జాతర నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

'సీ విజిల్'కు 196 ఫిర్యాదులు

పెద్దపల్లిరూరల్: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఘటనలపై సీ విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు 196 ఫిర్యాదులు అందాయని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1950 టోల్‌ఫ్రీ నంబరుకు 1590 ఫిర్యాదులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే చెక్‌పోస్టులతోపాటు సమాచారం ఆధారంగా చేపట్టిన తనిఖీల్లో రూ.కోటి89లక్షల61వేల 360 నగదు పట్టుకోగా ఆధారాలు చూపిన రూ.కోటి23లక్షల72వేల360 నగదును విడుదల చేసినట్లు ఆయన వివరించారు.

రూ.50లక్షల నగదు పట్టివేత

రామగుండం: రామగుండం బైపాస్ వద్ద పోలీసులు ఆదివారం రాత్రి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సై వెంకట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం(ఎఫ్ఎస్‌టీ) స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. ఈక్రమంలో గోదావరిఖని నుంచి రామగుండం వైపు వస్తున్న ఇన్నోవా వాహనంలో సోదాలు చేశారు. ఇందులో రూ.50లక్షలు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నగదుకు సంబంధించి సదరు వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు చూపించలేదన్నారు. నిబంధనల మేరకులా సొమ్ము సీజ్ చేసినట్లు వివరించారు.

ఆలోచించి ఓటేయాలి..

జంగ్ తెలంగాణ



అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్, ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు

- వేములవాడ, జగిత్యాలలో సీఎం ప్రజా ఆశీర్వాద సభ
- వేములవాడలో లక్ష్మీనర్సింహారావుకు మద్దతుగా సభ, జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ తరఫున కేసీఆర్ ప్రచారం..

వేములవాడ/జగిత్యాల: సీఎం కేసీఆర్ ఆదివారం ఉమ్మడి జిల్లాలోని వేములవాడ, జగిత్యాల నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. ముందుగా జగిత్యాలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మూడోసారి అధికారం చేపట్టి జగిత్యాలను కరీంనగర్‌లా మార్చుతామన్నారు. ప్రజలు ఆగం కావొద్దని, ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను రెండోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తారని వెల్లడించారు. కాంగ్రెస్ హయాంలో నీరు లేక, ఉద్యోగాలు లేక, కరెంట్ లేక గోస పడ్డామని, రైతుల ఆత్మహత్యలు, ఎన్నో ఘోరాలు చూశామని, తెలంగాణ తెచ్చుకున్నాక ఆ సమస్యలన్నీ తీరాయని వెల్లడించారు. జిల్లా అభివృద్ధి కళ్లముందే కనబడుతోందని, మెడికల్ కళాశాల, వరదకాలువ, సంక్షేమ పథకాలు కనిపిస్తున్నాయని తెలిపారు. రైతు రాజు కావాలనే ఉద్దేశంతో రైతుబంధు ఇస్తున్నామని, రైతులు ఎలాంటి సమస్యతో చనిపోయినా రైతుబీమా అందిస్తున్నామని వివరించారు. సాగునీటి సమస్య లేకుండా చేయడంద్వారా జిల్లా మొత్తం ధాన్యంరాశులతో నిండిపోయిందన్నారు. నీటిపన్ను లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని అన్నారు. జిల్లాలో బస్తీ దవాఖానాలు, రోళ్లవాగు ప్రాజెక్ట్, వరద కాలువ వంటి అనేక పనులు చేసుకున్నామని వివరించారు. పొరబాటున కాంగ్రెస్ వస్తే కరెంట్ మళ్లీ మూడు గంటలే వస్తుందన్నారు.

లక్ష్మీనరసింహారావు అభివృద్ధి చేస్తాడు..

వేములవాడలో మాట్లాడుతూ.. వేములవాడ అభ్యర్థి లక్ష్మీనర్సింహారావు యువకుడని, కచ్చితంగా అభివృద్ధి చేసి తీరుతాడని వెల్లడించారు. రమేశ్‌బాబు గొప్ప వ్యక్తి అని, కోర్టు కేసులతోనే ఆయనను మార్చాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలో వేములవాడ, సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాలను కల్లోలిత ప్రాంతంగా ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మరాజ్యం తెస్తామంటున్నారని.. ఇందిరమ్మ రాజ్యం బాగుంటే ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ఎందుకు పెట్టేవారని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం వస్తే మళ్లీ ఆకలికేకలు వినిపిస్తాయన్నారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు.

భావోద్వేగానికి గురైన ఎమ్మెల్యే రమేశ్‌బాబు

తొలుత ప్రసంగించిన ఎమ్మెల్యేరమేశ్‌బాబు ఈ ప్రాంత సమస్యలు సీఎంకు వివరిస్తూనే భావోద్వేగానికి గురయ్యారు. కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టు, ముంపు గ్రామాల సమస్య, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఎన్నికల ప్రచారంపై నిఘా

- సోషల్, ఎలక్ట్రానిక్ మీడియాపైనా నజర్
- సమీపిస్తున్న పోలింగ్ గడువు
- అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం



అధికారులకు సూచనలిస్తున్న ముజమ్మిల్‌ఖాన్

జిల్లా సమాచారం

ఓటర్లు	7,12,359
ఎన్నికల సిబ్బంది	6,030
నోడల్ అధికారులు	18
ప్రత్యేక నిఘా టీంలు	51
పోలింగ్ కేంద్రాలు	837

పెద్దపల్లిరూరల్: పోలింగ్‌కు నాలుగు రోజుల గడువే ఉంది. జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం అసెంబ్లీ స్థానాలకు పోటీపడుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ ప్రచారం హోరెత్తిస్తున్నారు. అయితే, ప్రచారం పక్కదారి పట్టకుండా, పోలింగ్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ సారథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఓటర్లు తమ ఓటుహక్కు స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు.

837 పోలింగ్ కేంద్రాలు..

- జిల్లాలో 7,12,359 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.
- వీరు తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు 837 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- ఇందుకోసం ఒక్కో పోలింగ్ కేంద్రానికి పోలింగ్ అధికారి, ఏపీవో, ఇద్దరు ఓపీవోల నియమించినట్లు అధికారులు వివరించారు.
- ఇలా జిల్లాలో 6,030 మంది సిబ్బందిని నియమించి వారికి శిక్షణ పూర్తిచేశారు.

ఈవీఎంల బాధ్యత సెక్టోరల్ అధికారులదే..

పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం, ఎన్నికల సామగ్రి తరలించి, ఓటింగ్ ప్రక్రియ పూర్తయ్యాక స్ట్రాంగ్ రూంలకు తరలించే బాధ్యతను సెక్టోరియల్ అధికారులకు అప్పగించారు. వాటిని సురక్షితంగా తరలించడం, తిరిగి తీసుకొచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

పోలింగ్ కేంద్రాలపై నిఘా..

- ప్రతీఓటరు తమ ఓటుహక్కు స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు వీలుగా ఉన్నతాధికారులు నిఘా ఏర్పాటు చేశారు.
- ఇందుకోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు.
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితా రూపొందించి సీసీ కెమెరాలు బిగించారు. వెబ్‌కాస్టింగ్ అమలు చేస్తారు.

సోషల్ మీడియాపై ఓ లుక్కు..

అభ్యర్థులు తమ ప్రచారానికి సోషల్, ఎలక్ట్రానిక్ మీడియాను వేదికగా చేసుకునే అవకాశాలు ఉన్నాయని భావించిన ఎన్నికల పరిశీలకులు.. వాటిపై నిఘా తీవ్రతరం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలను నియమించారు. జిల్లా కేంద్రంలోని మానిటరింగ్ కేంద్రం నుంచి ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తారు. నిబంధనలు ఉల్లంఘిస్తే అభ్యర్థులపై చర్యలకు సిద్ధంగా ఉన్నారు.

మద్యం అమ్మకాలపై కూడా..

ఓటర్లను అభ్యర్థులు ప్రలోభాలకు గురిచేసే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్న అధికారులు.. వాటిని అడ్డుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ప్రధానంగా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘాతీవ్రతం చేశారు. మద్యం అమ్మకాలపైనా ఓ లుక్కేశారు. రామగుండం ప్రాంతంలోని ఓ మద్యం దుకాణాన్ని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. తద్వారా మద్యం అక్రమ రవాణా, ఓటర్లకు చేరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు సంకేతాలు పంపించారు.

ఎన్నికల విధులపై అప్రమత్తంగా ఉండాలి

- సాధారణ ప్రత్యేక ఎన్నికల పరిశీలకుడు అజయ్ వి.నాయక్



మాట్లాడుతున్న అజయ్ వి.నాయక్

పెద్దపల్లిరూరల్: శాసనసభ సాధారణ ఎన్నికల విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సాధారణ ప్రత్యేక ఎన్నికల పరిశీలకుడు అజయ్ వి.నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆదివారం పోలీస్ ప్రత్యేక పరిశీలకుడు దీపక్ మిశ్రా, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్, రామగుండం సీపీ రెమారాజేశ్వరి, ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేశ్‌సింగ్ రాణా, సీఎస్ శ్రీధరన్, కిశోర్, ఆశిష్‌యాదవ్, సునీల్ శ్రీవాత్సవ్‌తో కలిసి ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్షించారు.

ఓటరులు స్లిప్పులు అందించాలి..

ప్రతీఓటరుకు స్లిప్పును తప్పనిసరిగా అందిచాలని పరిశీలకుడు అధికారులకు సూచించారు. తనిఖీల సందర్భంగా జప్తు చేసే నగదు, వస్తుసామగ్రి, ఆభరణాలను స్వాధీనం చేసే సమయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. సామాన్యులను అనవసరంగా ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ కట్టుదిట్టంగా చేపట్టాలని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీ చేతన, అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్, రిటర్నింగ్ అధికారులు మధుమోహన్, హనుమానాయక్, సీఈవో శ్రీనివాస్, డీపీవో చంద్రమౌళి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, డీసీవో శ్రీమాల, ఏవో శ్రీనివాస్, డెప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సరిహద్దుల్లో సీపీ పర్యటన


- మావోయిస్టుల గుర్తింపు కోసం డ్రోన్ ద్వారా పెట్రోలింగ్



డ్రోన్ ద్వారా పరిశీలిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని వేమనపల్లిలో రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఆదివారం పర్యటించారు. సరిహద్దుల్లోని పెర్రోపాయింట్ వద్ద డ్రోన్ పెట్రోలింగ్‌ను సీపీ ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సీపీ పేర్కొన్నారు. ప్రజల్లో నమ్మకం, భరోసా, భద్రత కలిగించేలా మావోయిస్టు ప్రభావిత ప్రాంతం వేమనపల్లిలో పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో కవాతు చేపట్టామని అన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆమె పేర్కొన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టించాలని చూస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువుల అక్రమ రవాణా అరికట్టేందుకు చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు విస్తృతం చేసినట్లు కమిషనర్ వివరించారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకన్, ఏసీపీ మోహన్, జార్కండ్ ఐపీఎస్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక దీపం





జిల్లావ్యాప్తంగా ఉన్న శివాలయాలు కార్తీక మాసం వేడుకలకు ముస్తాబయ్యాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కొందరు మహిళా భక్తులు ముందస్తుగా ఆలయాలకు చేరుకున్నారు. సాయంత్రం వేళ కార్తీక దీపాలు వెలిగించారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. కొందరు వ్రతాలు చేసుకున్నారు. మరికొందరు నోములు నోచుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఆలయాల్లోనూ భక్తులు పూజలు చేశారు.

\- సాక్షి, ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



రైలెక్కిన జేసీబీలు

ఓదెల(పెద్దపల్లి): మహారాష్ట్ర నుంచి సికింద్రాబాద్(చర్లపల్లి)కి జేసీబీల లోడ్‌తో వెళ్తున్న గూడ్స్‌రైలును స్థానిక ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. బల్లార్షా నుంచి సికింద్రాబాద్‌కు సుమారు 100 జేసీబీలతో ఆదివారం గూడ్స్ రైలు వెళ్లింది. దీంతో రామగుండం, పెద్దపల్లి, ఓదెల, పొత్కపల్లి, కొలనూర్, జమ్మికుంట రైల్వేస్టేషన్లలో ప్యాసింజర్ రైళ్లకోసం వేచిచూస్తున్న ప్రయాణికులు వాటిని ఆసక్తిగా తిలకించారు. ప్రస్తుతం వ్యవసాయ పనుల నిమిత్తం జేసీబీలు కొనుగోళ్లు వేగవంతమయ్యాయి. దీంతో వాటిని గమ్యస్థానాలకు రైలు ద్వారా ఇలా తరలించినట్లు సమాచారం.

కలల వారధి!



ఇతడి పేరు కొక్కుల రమేశ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఈయనకు బంధాలు, బంధుత్వాలు ఉన్నాయి. రాకపోకలకు మానేరు అడ్డుగా ఉంది. దీనిపై వంతెన నిర్మిస్తే 40కి.మీ. దూరం తగ్గి రూ.100చార్జీతో గమ్యస్థానం చేరుతారు. కానీ, బ్రిడ్జి పూర్తికాకపోవడంతో వావిలాల, కాల్వశ్రీరాంపూర్ లేదా పరకాల, భూపాలపల్లి, మంథని మీదుగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఇందుకు దూరభారమే కాదు.. బస్సు చార్జీ రూ.400వరకు చెల్లించాల్సి వస్తోంది.

- పాలకులు మారుతున్నారు.. పనులు పూర్తి కావడం లేదు
- దశాబ్దాలుగా ముందుకు సాగని ఓడేడు – గర్మిళ్లపల్లి వంతెన
- క్యాన్లు, తెప్పల సాయంతో మానేరు ఈదుతున్న ప్రజలు
- బ్రిడ్జి అందుబాటులోకి వస్తే.. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు మేలు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

ముత్తారం(మంథని): ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. అయినా ఓడేడు – గర్మిళ్లపల్లి మధ్య మానేరుపై చేపట్టిన హైలెవల్ వంతెన నిర్మాణం పూర్తికావడంలేదు. అవసరమైన నిధులు పుష్కలంగా ఉన్నా.. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో పనుల్లో తీవ్రంగా జాప్యమవుతోంది. శంకుస్థాపన చేసి సుమారు 16ఏళ్లు గడుస్తున్నా.. బ్రిడ్జి పిల్లర్ల దశదాట నేలేదు. వంతెన అందుబాటులోకి వస్తే.. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. వ్యవసాయం, సింగరేణి, జెన్‌కో పారిశ్రామిక ప్రాంతాలకు అనేక రకాలుగా ప్రయోజనాలు కలుగుతాయి.



మానేరు ప్రవాహం దాటుతున్న ప్రజలు



పిల్లర్ల దశలో ఆగిన మానేరు వంతెన

మూడు జిల్లాలతో అనుసంధానం..

- ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలకు రవాణా సౌకర్యం కల్పించడం, దూర భారం తగ్గించడం కోసం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు – జయశంకర్ భూపాలపల్లి జిల్లా గర్మిళ్లపల్లి మధ్య మానేరుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి పూనుకున్నారు.
- ఇందుకోసం ఆర్ అండ్ బీ నుంచి రూ.47.7 కోట్లు మంజూరు చేశారు.
- 2016 ఆగస్టు 4న వంతెన పనులకు శంకుస్థాపన చేశారు.
- సుమారు కి.మీ. పొడవున 23 పిల్లర్లు, రెండు గోడలతో 24స్లాబ్‌లు నిర్మించేందుకు ఇంజినీర్లు డిజైన్ చేశారు.
- అయితే, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేని తనం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు పిల్లర్ల దశలోనే నిలిచాయి.
- ఇప్పటివరకు 40శాతం పనులు మాత్రమే పూర్తికాగా రూ.18కోట్ల వరకు అధికారులు బిల్లులు చెల్లించినట్లు తెలుస్తోంది.
- వంతెన అందుబాటులోకి వస్తే పత్తి, మిర్చి రైతులు, వ్యాపారులు, సింగరేణి, జెన్‌కోలోని కార్మికులకు ఓరుగల్లు దగ్గరవుతుంది.

ఉమ్మడి ఏపీలో బీజం..

ఇక్కడి ప్రజాప్రతినిధుల విన్నపం మేరకు మానేరుపై వంతెన నిర్మాణానికి 2008 సెప్టెంబరు 19న అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం వైఎస్సార్ రూ.6కోట్లు మంజూరు చేశారు. ఇందులోంచి రూ.లక్షలు వెచ్చించి ఆర్ అండ్ బీ ఇంజినీర్లు సర్వేచేశారు. మట్టి నమోనాలు సేకరించి వాగుపై లో లెవల్ వంతెనకు అనుకూలం లేదని, హై లెవల్ వంతెన నిర్మాణానికి ప్రతిపాదించారు. దీంతో 2013 ఏప్రిల్ 27న అప్పటి సీఎంకు రూ.30కోట్లతో ప్రతిపాదనలు అందాయి. ఆ ఫైల్‌కు కదలిక రాలేదు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రూ.47.7కోట్లు మంజూరయ్యాయి. దీంతో 2016 ఆగస్టు 4న మానేరుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

మానేరు తీరం.. అభివృద్ధికి అవకాశం..

- మానేరుపై వంతెన నిర్మిస్తే తీరప్రాంతాల్లోని గర్మిళ్లపల్లి, రాఘవాపూర్, గిద్దెముత్తారం, వెంకట్రావ్‌పల్లి, మొగుళ్లపల్లి, చిట్యాల, పరకాల, ముత్తారం, ఓడేడు, అడవిశ్రీరాంపూర్, ఖమ్మంపల్లి శరవేగంగా అభివృద్ధి చెందుతాయి.
- మంథని, గోదావరిఖని తదితర ప్రాంతాలతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలకు రవాణా సౌకర్యం మెరుగుడపతుంది.

గడువు పొడిగింపులే..

హైదరాబాద్‌కు చెందిన సాయి కన్‌స్ట్రక్షన్ కంపెనీ వంతెన టెండరు దక్కించుకుంది. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తిచేయలేదు. దీంతో 2020లో ఆ కాంట్రాక్టర్‌ను టర్మినేషన్ చేశారు. ఆ తర్వాత ఆ కాంట్రాక్టర్ మళ్లీ టెండరు దక్కించుకున్నాడు. 2023 మార్చిలో వంతెన నిర్మించాలని ఒప్పందం జరిగింది. గడువు తీరినా పనులు పూర్తికాలేదు.

అంత్యక్రియలకు అందలే



మా తల్లిగారి ఊరు ముత్తారం మండలం ఖమ్మంపల్లి. మా బంధువు చనిపోతే సకాలంలో దహన సంస్కారాలకు అందలే. మానేరుపై వంతెన పూర్తిచేయిస్తే ఈ సమస్య ఉండేది కాదు. అధికారులు స్పందించాలె.

\- బండారి లక్ష్మి, గిద్దెముత్తారం

దూరం తగ్గుతుంది



ఓడేడు వంతెన పనులు పూర్తయితే మాకు దూర భారం తగ్గుతుంది. మానేరు దాటి ఓడేడ్‌కు వస్తే సింగరేణి పారిశ్రామిక ప్రాంతానికి వెళ్లడం సులభంగా ఉంటుంది. వంతెన తొందరగా కట్టించాలె.

\- వంగజాల మధునమ్మ, గర్మిళ్లపల్లి

ఉప్పొంగితే గండమే..



మానేరు ఆవలివైపున్న గర్మిళ్లపల్లి శివారులో పదెకరాలు కౌలుకు తీసుకున్న. మానేరు ఉప్పొంగితే ఎవుసం పనులకు పోవుడు బంద్. తప్పనిసరి పరిస్థితి అయితే 70కి.మీ. ప్రయాణం చేయాలె.

\- గంధం వెంకటమ్మ, ఓడెడ్

ఏరు ఈదుతున్నం



మాకు మానేరు ఆవలివైపు గర్మిళ్లపల్లి శివారులో తాటిచెట్లున్నయి. 300మందికి పైగా గీతకార్మికులకు అవే ఆధారం. క్యాన్ల సాయంతో మానేరులో ఈదుతూ అటుచేరుకుని ఉపాధి పొందుతున్నం.

\- బండారుపు నారాయణ, ఓడెడ్

నోటీసులు జారీచేశాం

గత మార్చి వరకే మానేరుపై వంతెన నిర్మించాల్సి ఉంది. ఇప్పటివరకు 40శాతం పనులే పూర్తయ్యాయి. గడువు తీరినా నిర్మాణం పూర్తిచేయని కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీచేశాం. కాంట్రాక్టర్ నుంచి స్పందన రాకుంటే టెండరు రద్దు చేసి మళ్లీ కొత్తగా పిలుస్తాం.

\- జాఫర్, డీఈఈ, ఆర్ అండ్ బీ

కేసీఆర్ పాలనలో అన్నివర్గాలకు న్యాయం

● బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్

గోదావరిఖని: సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని రామగుండం బీఆర్‌ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్ పేర్కొన్నారు. 29, 37డివిజన్లలో ఆయన ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, పెంట రాజేశ్, కౌశిక్‌హరి, కొమ్ము వేణు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 300 మంది యువకులు పార్టీలో చేరగా, వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రామగుండం: ఎల్లంపల్లి నిర్వాసిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని రామగుండం బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. ఆదివారం అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి, పెద్దంపేట, రాయదండి గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఇప్పటికే రామగుండం నియోజకవర్గ పరిధిలో 65 వేల మందికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ఎన్నికల ఇన్‌ఛార్జీ నారదాసు లక్ష్మణ్‌రావు, కౌశిక హరి, ఎల్లంపల్లి, ముర్మూర్ సర్పంచులు గుమ్ముల రవీందర్, బాదరవేణి స్వామి, జెడ్పీటీసీ ఆముల నారాయణ, ధర్మాజి కృష్ణ, తదితరులున్నారు.

క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి

మార్కండేకాలనీలోని బృందావన్ గార్డెన్‌లో నిర్వహించిన క్రిస్టియన్ ఆత్మీయ సమ్మేళనానికి కోరుకంటి చందర్ హాజరై మాట్లాడారు.


రామగుండం: ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే చందర్


ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాలకుర్తి: రామగుండం ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్‌ను విమర్శించే స్థాయి కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డికి లేదని మండల బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. ఆదివారం బసంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల బీఆర్‌ఎస్ దళిత నాయకులు మాట్లాడారు.

వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని టీబీజీకేఎస్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య అన్నారు. ఆదివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

రామగుండం: పట్టణంలోని నాలుగు డివిజన్ల పరిధిలో ఆదివారం బీఆర్‌ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం చేప

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ యూత్ విభాగం నాయకులు ఆదివారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్ రామగుండం, మంథని నియోజకవర్గాల అభ్యర్థులు కోరుకంటి చందర్, పుట్ట మధుకర్‌కు మద్దతుగా బసంత్‌నగర్ విమానాశ్రయం నుంచి ప్రారంభించిన ర్యాలీ రాజీవ్ నగర్, బసంత్‌నగర్, వర్కర్స్‌కాలనీ, జైపైపు క్వార్టర్స్ , బస్టాండ్ మీదుగా జీడీనగర్ వరకు కొనసాగించారు.

మరోసారి ఆశీర్వదించండి

పెద్దపల్లిరూరల్: మరోసారి తనకు ఎమ్మెల్యేగా అవకాశమివ్వాలని పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి శివారు బందంపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాల్గొని మాట్లాడారు. అంతకుముందు బీఎస్పీలో చేరిన కౌన్సిలర్ కార్తీక్ బీఆర్‌ఎస్ లో చేరారు. ఎమ్మెల్యే తనయుడు ప్రశాంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సుల్తానాబాద్ : నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన వారిని ప్రజలు ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత కోరారు. మండలకేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమమే ఎజెండాగా ముందుకెళ్తున్న ప్రభుత్వాన్ని ఓటర్లు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఐల రమేశ్, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు

జూలపల్లి: కార్మికులకు భరోసా, ఆత్మస్థైర్యం కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో తెలుకుంటకు చెందిన యాభై మంది గీత కార్మికులు బీఆర్‌ఎస్‌లో చేరగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్‌తో కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను బీఆర్‌ఎస్ పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమాల్లో తొగరు శ్రీనివాస్, రామకృష్ణరెడ్డి, చారి, తదితరులున్నారు.

ఎలిగేడు: బీఆర్‌ఎస్ ఎన్నికలలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు వేముల రామ్మూర్తి, జూలపల్లి జడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి కోడలు గీట్ల సవితారెడ్డిలు పద్మశాలీ సంఘం ప్రతినిధులతో సమావేశమయ్యారు. బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలపాలని కోరారు.


మాట్లాడుతున్న దాసరి మనోహర్‌రెడ్డి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న రవీందర్ సింగ్

దాసరిని గెలిపించాలని ప్రచారం

పెద్దపల్లి ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం మండలకేంద్రంతోపాటు సుల్తాన్‌పూర్, ధూళికట్ట, ముప్పిరితోటతోపాటు పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ స్రవంతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ నరినేని సుధాకర్ రావు, కప్పల ప్రవీణ్, వినోద్, బద్దం తిరుపతిరెడ్డి బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికే ప్రజలు ఓటు వేయాలి

● బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు

పలిమెల: అభివృద్ధికి ఓటేయాలని మంథని నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి పుట్ట మధు అన్నారు. ఆదివారం మండలంలోని లెంకలగడ్డ, పంకెన, మోదేడు, పలిమెల, కామన్‌పల్లి, ముకునూరు, నీలంపల్లి, దమ్మూరు, బూరుగగూడెం, సర్వాయిపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ శ్రీధర్‌బాబు ఎలాంటి అభివృద్ధి చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. మండలకేంద్రంలోని ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన జనగామ రవి కుటుంబాన్ని పరామర్శించారు. మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి, మహదేవ్‌పూర్ మండల అధ్యక్షుడు లింగంపల్లి నాయకులున్నారు.

మంథని: ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి కృషిచేసే నాయకులను ఆదరిస్తామని, పుట్ట మధుకు తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర జాతీయ కార్యదర్శి రేణుకుంట్ల కొమురయ్య మాదిగ అన్నారు. మండలంలోని ఎక్లాస్‌పూర్ ఫంక్షన్ హాల్‌లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్రం నాయకులు సమావేశం నిర్వహించారు.

మధుతోనే మంథని అభివృద్ధి

మంథని అభివృద్ధి పుట్టమధుతోనే సాధ్యమవుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లం లింగమూర్తి పటేల్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో సంక్షేమ సంఘం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు సుంకరి పోతరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.


మాట్లాడుతున్న పుట్ట మధు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

రాష్ట్రంలో 24గంటల విద్యుత్

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సమస్య ఉండేదని రాష్ట్రంలో 24గంటల నాణ్యమైన విద్యుత్ అందుతుందని ఎన్నికల ఇన్‌చార్జి, ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి అన్నారు. మంథనిలోని రాజగృహాలో ఆయన మాట్లాడారు.

మున్నూరు కాపులపై దాడి సరికాదు

మున్నూరు కాపులపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చేస్తున్న దాడులు హేయమైన చర్య అని ఆ సంఘం నాయకులు అన్నారు. మంథనిలో వారు మాట్లాడారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

బీజేపీకి చెందిన ముఖ్య నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీజేపీ మండల ఇన్‌చార్జి తోట మధూకర్, మండలప్రధాన కార్యదర్శి ఆరె ఓదెలు, శక్తికేంద్ర ఇన్‌చార్జి జెట్టి శంకరయ్య పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా పుట్ట మధు పార్టీలోకి ఆహ్వానించారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు

మహాదేవపూర్: బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతోపాటు తన సొంత మేనిఫెస్టో కూడా అమలు చేస్తానని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. తాను గెలిస్తే నియోజకవర్గంలోని విద్యార్థుల పైచదువులు, పోటీ పరీక్షలకు హైదరాబాద్‌లో ఉచితహాస్టల్ వసతి కల్పిస్తానన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

● మంథని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని: కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు ఇంటింటికీ అందిస్తామని మంథని కాంగ్రెస్ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని బిట్టుపల్లి, గద్దలపల్లి, గోపాల్‌పూర్, చిన్నఓదాల, రచ్చపల్లి గ్రామాల్లో పర్యటించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బీఆర్‌ఎస్ పూర్తిగా విస్మరించిందన్నారు. పదేళ్లుగా రేషన్ కార్డుల్లో పేర్లను కూడా నమోదు చేయలేదన్నారు. అధికారంలోకి రాగానే మూడు పంటలకు రైతులకు విద్యుత్ అందిస్తామని కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయనున్నట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. రైతులకు ఉచితంగా కరెంట్ అందించింది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా మంచిర్యాల జిల్లా జైపూర్, భూపాలపల్లిలో థర్మల్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసిందన్నారు.

రామగిరి: కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని మంథని కాంగ్రెస్ ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని రత్నాపూర్, నాగెపల్లి, నవాబ్‌పేట, బేగంపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఉమ్మడి కమాన్‌పూర్ మండలంలో జేఎన్టీయూ కళాశాల, కృషి విజ్ఞాన కేంద్రం, హార్టీ కల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, ఎంపీపీ ఆరెల్లి దేవక్క, మండల అధ్యక్షుడు రోడ్డ బాపు, మాజీ జెడ్పీటీసీ గంట వెంకట రమణా రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఆర్జీ–3 డివిజన్ అధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి, నాయకులు ఎల్లె రాంమూర్తి, వేగోలపు శ్రీనివాస్, బొగె లింగయ్య, మట్ట రాజ్‌కుమార్,బోగె ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి శ్రీధర్ బాబు


ప్రచారం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం, పెగడపల్లి, స్తంభంపల్లి(పీపీ) తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ ఎన్నికల క్యాంపెనింగ్ జాయింట్ సెక్రెటరీ ఇనుగొండ వెంకట్‌రెడ్డి, డీసీసీ సెక్రెటరీ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కిషన్‌నాయక్, ధన్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం: మాజీ జెడ్పీటీసీ నాగినేని జగన్‌మోహన్ రావు సమక్షంలో ముత్తారానికి చెందిన యూత్ నాయకులు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. గ్రామానికి చెందిన పెయ్యాల సాయికిరణ్, కలవేన మధూకర్, కాశగాని చందుతో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ముత్తారంలో ఎస్సీకాలనీకి చెందిన 50మంది మహిళలు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఇంటింటా ప్రచారం చేశారు. నాయకులు తూటి రఫీ, బోల్నేని బుచ్చారావు, తాటిపాముల శంకర్, శ్రీనివాస్, రాజయ్య, సంపత్, కోల విజయ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా


ఓటు అభ్యర్థిస్తున్న సునీల్‌రెడ్డి

మంథని: మంథని ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని, ఎన్నికల్లో ఒక్క అవకాశం కల్పించాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి కోరారు. ఆదివారం మంథని నియోజకవర్గంలోని వెంకటాపూర్, కుమారస్వామి నగర్, ముస్త్యాల, చందనాపూర్, గ్రామాలలో ప్రచారం నిర్వహించారు.

రామగిరి: మండలంలోని కల్వచర్ల, ఆదివారంపేట గ్రామాలలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల సునీల్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

అవ్వలారా.. ఒక్క అవకాశం ఇవ్వండి


మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్

ధర్మపురి: 'అవ్వలారా.. అక్కలారా.. అన్నలారా ఒక్కసారి మీ బిడ్డగా అవకాశమివ్వండి మీ రుణం తప్పక తీర్చుకుంటా. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అధిష్టానం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటి పథకాలను మీ ముందుకు తీసుకువస్తా ఆదరించండి' అని కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వేడుకున్నారు. మండలంలోని రాయపట్నంలో ఆదివారం సాయంత్రం గడప గడపకు ప్రచారం చేసి కొంగుపట్టి అడుక్కున్నాడు.

ధర్మారం: మండలంలోని నందిమేడారంకు చెందిన బీసీ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిప్ప మణిశర్మ ఆదివారం అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. పలు పార్టీలకు చెందిన వంద మంది యువకులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రూ.5 లక్షల విరాళం అందించారు. లక్ష్మణ్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్మారంలో పాదయాత్ర చేశారు.

మెనారిటీలకు 12శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం


ప్రచారం చేసన్తున్న మక్కాన్ సింగ్

ఫెర్టిలైజర్‌సిటీ: ఎఫ్‌సీఐ మూతపడితే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ పేరుతో తెరిపించిందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. ఆదివారం రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మిపురం, లక్ష్మిపురం కొత్తగేట్‌లో ప్రచారంలో కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మైనారిటీలకు 12శాతం రిజర్వేషన్ ఇస్తామన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని 17, 19 డివిజన్ ఏరియాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు కాలనీ పట్టణ అధ్యక్షుడు రాజేష్, నరేష్, సోను డివిజన్ అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు హెచ్‌ఎంఎస్ మద్దతు

గోదావరిఖని: కాంగ్రెస్ పార్టీకి హెచ్‌ఎంఎస్ యూనియన్‌మద్దతు ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు రియాజ్‌అహ్మద్ తెలిపారు. ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి మోహన్‌జోషి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాగూర్‌తో కలిసి హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

రాజన్న కోడెలు మృత్యువాత

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం గోశాలలోని మూడు కోడెలు ఆదివారం మృతిచెందినట్లు సీనియర్ అసిస్టెంట్ శ్యామ్ తెలిపారు. రోగాల బారినపడి చికిత్స అందించినా నయంకాక మృత్యువాత పడినట్లు తెలిపారు.

బైక్ ఢీకొని యువకుడికి గాయాలు

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలకేంద్రంలో ఆదివారం ఓ పార్టీకి చెందిన ర్యాలీ ఉండటంతో ట్రాఫిక్‌ను వన్‌వేలో మళ్లించారు. దీంతో ఎదురెదురుగా వెళ్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. తంగళ్లపల్లి గ్రామానికి చెందిన చుక్క రాజశేఖర్, అంకారపు సాయికృష్ణ వెళ్తుండగా పెద్దలింగాపూర్‌కు యువకుడు బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో సాయికృష్ణ తలకు తీవ్రగాయాలు, రాజశేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
B.Tech. Exams
■ B.Tech. Exams: Exams in April - 2024 Discontinued Students only. B.Tech. All Groups. Last Date of submission 30-11.2023. Cont: N. Prakasham, Cell: 9705039639. [K- 1185675]

SERVICES
■ షూరిటీ, సెక్యూరిటీ, వ్యక్తిగత, వ్యాపార, వ్యవసాయంపై అతి తక్కువ వడ్డీతో రుణం ఇవ్వబడును. Mr. Rohit Wonder Capital PH: 9041114468 [W-788952]

BUSINESS OFFER
■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9311685170. [T-1258784]

www.sakshi.com

WANTED
■ కరీంనగర్‌లోని ప్రముఖ 2వీలర్ ఆటో స్టోర్‌లో పనిచేయడంకోసం అనుభవం కలిగిన సేల్స్ మ్యాన్ మరియు కార్ వీల్ అలైన్మెంట్ కోసం అనుభవం కలిగిన టెక్నీషియన్ కావలెను. సంప్ర॥9550 458 288 [K-1185741]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

ఇంటింటికీ ఆరు గ్యారంటీ పథకాలు

పెద్దపల్లి రూరల్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరుగ్యారంటీలను అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం చీకురాయి, భోజన్నపేట, మూలసాల, కొత్తపల్లి, దస్తగిరిపల్లి, పెద్దబొంకూర్ గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు తదితరులతో కలిసి నిర్వహించారు. నాయకులు పెగడ రమేశ్, సరోత్తంరెడ్డి, అల్లెంకి శ్రీనివాస్, సత్యం, రాజేందర్, సంతోష్, నరేశ్, రాజు, విజేందర్‌రెడ్డి, సుభాష్‌రావు తదితరులున్నారు. అంతకు ముందు పెద్దపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ కొమిరిశెట్టి కనకలక్ష్మి శ్రీకాంత్ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. విజయరమణారావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మైనార్టీల మద్దతు కాంగ్రెస్ కే

మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్ సర్కార్‌తోనే సాధ్యమని ఈసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మైనార్టీల మద్దతు కాంగ్రెస్ కేనని ఏఐసీసీ మైనార్టీసెల్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం కాంగ్రెస్ అభ్యర్థి వియజరమణారావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.


చీకురాయిలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావు

ఎలిగేడు: పెద్దపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతకుంట విజయరమణారావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని 12గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.

పెద్దపల్లిరూరల్: పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయరమణారావు సతీమణి పావని అన్నారు. పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో హమాలీ కార్మికులను కాంగ్రెస్‌కు ఓటేయాలని అభ్యర్థించారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్ : కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చింతకుంట విజయ రమణారావుకు మద్దతుగా పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పెద్దమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పూసాల మీదుగా ఆరెపల్లి సుల్తానాబాద్, శాస్త్రీనగర్, సుగ్లాంపల్లి వరకు ర్యాలీ తీశారు.

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): సంక్షేమ పథకాలకు కేరాఫ్ కాంగ్రెస్ అని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయరమణారావు అన్నారు. కాల్వశ్రీరాంపూర్, పెగడపల్లిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే రాష్ట్రంలో అభివృద్ధి


మంత్రి ఈశ్వర్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న వృద్ధులు

వెల్గటూర్: బీఆర్‌ఎస్ పాలన లోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. వెల్గటూర్ మండలంలోని రాజక్కపల్లి, కిషన్‌రావుపేట గ్రామాల్లో ఆదివారం ప్రజాఆశీర్వాద యాత్రలో పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. అభివృద్ధిలో, సంక్షేమంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపిన ఘనత సీఎం దే అని కొనియాడారు. ఎన్నో సంక్షేమ పథకాలు, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి ఆదరించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇంటి ప్రహరీని ఢీకొట్టిన ట్రాక్టర్

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో శనివారం అర్ధరాత్రి తిప్పాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి పార్కింగ్‌లో పెట్టిన ట్రాక్టర్ నడిపించడంతో అదుపుతప్పి పులి పర్శయ్య ఇంటి ప్రహరీని ఢీకొట్టింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పర్శయ్య పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పంచాయతీ సెక్రెటరీలకు పోస్టల్‌బ్యాలెట్ లేనట్లే !

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజ్యాంగం ప్రతి పౌరునికి కల్పించిన ఓటుహక్కుకు జిల్లాలోని సుమారు 70 మంది పంచాయతీ కార్యదర్శులు దూరమయ్యారని తెలుస్తోంది. జిల్లా అధికారుల ఉదాసీనత, నిర్లక్ష్యంతో ఇతర జిల్లాల నుంచి రాజన్నసిరిసిల్ల జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు తమ సొంతూళ్లకు వెళ్లి ఓట్లు వేయకుండా డ్యూటీలోనే ఉండాల్సి వచ్చింది. అదే సమయంలో వారికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాల్సి ఉండగా.. జిల్లాలో మాత్రం అవకాశం ఇవ్వకపోవడంతో ఓటుహక్కు వినియోగాన్ని కోల్పోతున్నారు. అదే సమయంలో పోస్టింగ్ ఉన్న గ్రామం విడిచి వెళ్లకూడదని ఆదేశించడంతో అయోమయంలో పడ్డారు. ఈ విషయంపై ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కార్యదర్శులు కోరుతున్నారు.

బీఎస్పీకి అండగా నిలవండి


ప్రచారంలో పాల్గొన్న దాసరి ఉష

పెద్దపల్లిరూరల్/జూలపల్లి: బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల సంక్షేమం కోసం పనిచేసే బహుజన సమాజ్ పార్టీకే అండగా నిలవాలని ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష కోరారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ లో ఆదివారం ప్రచారం నిర్వహించారు.

బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యం

బహుజనులకు రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యమని దాసరి ఉష అన్నారు. జూలపల్లి మండలంలోని చీమలపేట, బాలరాజుపల్లె, గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. ప్రజల కోసమే పనిచేసేందుకు ఏనుగు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. మండల కేంద్రంలో పెద్దపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి అఖిల, మండల అధ్యక్షుడు సీపెల్లి కొమురయ్య ఆధ్వర్యంలో మహిళలు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి కోలాటం ఆడారు. ప్రచారంలో ఆట్ల లక్ష్మయ్య, భూమయ్య,గొలిశ్రీనివాస్,రాజిరెడ్డి, మల్లేశం, రాజేశం, తదితరులు ఉన్నారు.